
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 5

బుధవారం 12 మార్చి 2025



	ఇఫ్తార్	సెహరి
	బుధవారం	గురువారం
కర్నూలు	6:32	5:06
నంద్యాల	6:29	5:05

రంజాన్ వేళలు





ప్రమాదంలో నుజ్జయిన ద్విచక్ర వాహనం, కారణమైన కర్ణాటక బస్సు





చిన్నారి సుష్మితను పట్టుకొని విలపిస్తున్న పెద్దమ్మ



ఈరన్న, ఆదిలక్ష్మి (ఫైల్)



హేమాద్రి, నాగరత్న దంపతులు(ఫైల్)



దేవరాజు (ఫైల్)

రుధిర ధారలు

- ఆదోని మండలం పాండవగల్లులో ఘోర రోడ్డు ప్రమాదం
- రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కర్ణాటక బస్సు
- ఐదుగురు దుర్మరణం
- కుప్పగల్లుకు చెందిన దంపతులు మృతి
- మరో దంపతులు, కుమారుడు మృత్యువాత
- అతివేగమే ప్రమాదానికి కారణం
- విచారం వ్యక్తం చేసిన మంత్రి నారా లోకేశ్



ప్రమాదంలో ధ్వంసమైన ద్విచక్ర వాహనం

పుట్టబోయే బిడ్డ కోసం ఆసుపత్రికి బయల్దేరిన దంపతులు.. అనారోగ్యం బారిన పడి నాటు వైద్యుడిని సంప్రదించేందుకు భార్య, కుమారుడితో బయల్దేరిన హోంగార్డు. ఉదయం సంతోషంగా బయల్దేరిన ఆ ఐదుగురిని కాలం బలితీసుకుంది. రోడ్డు ప్రమాదానికి గురై మృత్యుఒడికి చేరారు. అతివేగంతో ఐదు నిండు ప్రాణాలను బలితీసుకున్న కర్ణాటక బస్సు రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. వీరిలో ఓ మహిళ గర్భిణి కావడం మరింత విషాదకరం. 'అయ్యో.. దేవుడా.. ఎలా బతికేది స్వామీ. ఎంత పనిచేశావయ్యా. బిడ్డలను దిక్కులేని వాళ్లను చేశావు కదయ్యా.' అంటూ కుటుంబ సభ్యులు విలపించడం చూపరులకు కన్నీళ్లను తెప్పించింది. ఈ విషాద సంఘటన ఆదోని మండలం పాండవగల్లు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. రెండు ద్విచక్ర వాహనాలను కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మృతి చెందారు.

ఆదోని/ఆదోని రూరల్, కర్నూలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల గర్భిణిగా ఉన్న భార్యకు వైద్యపరీక్షల కోసం ఓ జంట.. చర్మసంబంధిత నాటు వైద్యం కోసం కొడుకుతో కలసి మరో జంట ద్విచక్రవాహనాలపై బయలుదేరారు. ప్రాంతాలు వేరైనా ఇద్దరిది ఒకే అవసరం. వైద్యం చేయించుకోవాలని ప్రయాణమయ్యారు. మరో 15-20 నిమిషాల్లో గమ్యానికి చేరుకోబోతున్నారు. ఎండలు మండుతుండడంతో త్వరగా వెళ్లి వైద్యం చేయించుకొని ఇంటికి చేరుకోవాలని సాగిపోతున్నారు. రెండు బైక్‌లు పాండవగల్లు గ్రామం దాటి జాలిమంచి క్రాస్ రోడ్డుకు చేరుకున్నారు. ఎదురుగా మృత్యుశకటంలా వస్తున్న కర్ణాటక బస్సు వీరి ద్విచక్ర వాహనాలను ఒకదాని తరువాత మరోదాన్ని వేగంగా ఢీ కొట్టింది. బైకులపై వెళ్తున్న ఐదుగురు బస్సు చక్రాలు కింద నలిగిపోయారు. కుప్పగల్లుకు చెందిన యువ రైతు కురవ పూజారి ఈరన్న, అమ్మ గర్భంలో పెరుగుతున్న పిండంతో సహా ఆయన భార్య ఆదిలక్ష్మి, కర్ణాటక రాష్ట్రం మాన్వి పట్టణానికి చెందిన హోంగార్డు మంగలి హేమాద్రి భార్య నాగరత్న, కుమారుడు దేవరాజు అక్కడికక్కడే మృత్యుఒడికి చేరుకున్నారు. రక్తమడుగులో చిక్కుకొని కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న హోంగార్డు హేమాద్రినైనా బతికించాలని పోలీసులు ఆదోని ఆస్పత్రికి చేర్చగా చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. ఆదోని-మంత్రాలయం రహదారి.. రుధిర ధారలతో రక్తసిక్తమైంది. చెల్లాచెదురుగా పడిన మృతదేహాలను చూసిన స్థానికులు 'అయ్యో..! పాపం ఎంత ఘోరం జరిగింది' అంటూ కన్నీరు పెట్టారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతి వేగం ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు నిర్ధారించారు.

మిగతా 7వ పేజీలో



రోదిస్తున్న కుటుంబ సభ్యులు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీ



మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు

వరి, జొన్న రైతులను ఆదుకోండి

సీఎంను కలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వరి, జొన్న పంటలకు సరైన మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు వినతిపత్రం అందజేశారు. మంగళవారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, గిత్తా జయసూర్య, గౌరు చరితారెడ్డి అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. నంద్యాల జిల్లాలో వరి, జొన్న పంట విస్తారంగా సాగుచేస్తారన్నారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

జొన్నకు ప్రస్తుతం క్వింటాకు రూ.2400 మాత్రమే చెల్లిస్తున్నారని, రూ.3,400కు మద్దతు ధర పెంచాలని, అలాగే వరి క్వింటానికి రూ.1,200 చెల్లిస్తున్నారని, క్వింటానికి రూ.1800 మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రులు, ఎమ్మెల్యేలు తెలిపారు. అనంతరం వారు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు.

ఇంటర్ పరీక్షకు 660 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని 53 పరీక్షా కేంద్రాల్లో మంగళవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫిజిక్స్ ఎకనామిక్స్ పరీక్షలను నిర్వహించారు. పరీక్షలకు 15,110 మంది ఇంటర్ జనరల్ విద్యార్థులు హాజరు కావాల్సి వుండగా 14,563 మంది విద్యార్థులు హాజరయ్యారు. 547 మంది గైర్హాజరయ్యారు. అలాగే 1,494 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉండగా 1,381 మంది హాజరయ్యారు. 113 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 660 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో సునీత తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదన్నారు.

కల్యాణం.. వైభోగం...

- ఘనంగా అహోబిల నృసింహుడి కల్యాణోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- 'దిగువ'లో బృందలోలుడి అలంకరణలో ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 11(ఆంధ్రజ్యోతి): భక్తజన వరదా.. జ్వాలా నృసింహ నమోస్తుతే.. గోవిందా.. గోవిందా.. స్మరణతో ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలం పులకించింది. చెంచులక్ష్మి, నరసింహస్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం సాయంత్రం కన్నులపండువగా సాగింది. చెంచులక్ష్మి సమేతుడైన వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి వేదమంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య ముల్లోకాలు మురిసేలా మూడుముళ్ల బంధంతో జ్వాలా నరసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవారు ఒక్కటైన మధురక్షణాలు భక్తులను మంత్రముగ్ధుల్ని చేశాయి. ఎగువ అహోబిలంలో అశేష భక్తజన సందోహం మధ్య స్వామి, అమ్మవార్ల తిరు కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్, వేదపండితులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు శాస్త్రోక్తంగా ఎదుర్కోళ్లు నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తుండగా స్వామి, అమ్మవారికి అర్చకులు కంకణధారణ చేశారు. వేదపండితుల మంత్రాలు, భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల మధ్య మాంగళ్యధారణ కార్యక్రమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల పాదాల వద్ద ముత్యాల తలంబ్రాలు పోసి అహోబిలేశుడి తిరు కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా జరిపించారు. పద్మశాలి సంఘం తరఫున ప్రొద్దుటూరుకు చెందిన అగ్గారపు శివ శంకర్, అరుణ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి స్వామివారి కల్యాణానికి ఉభయదారులుగా వ్యవహరించారు.

వేణుగోపాలుడిగా ప్రహ్లాదవరదుడు

దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామి వేణుగోపాలుని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి, భూదేవీ సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణుగోపాలుని అలంకారంలో స్వామివారు ఉభయదేవేరులకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం పల్లకిలో కొలువై ఆలయ మాడ వీధుల్లో విహరించారు. శ్రీవారిని పట్టువస్త్రాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించి రాత్రి పొన్నచెట్టు వాహనంపై కొలువుంచి తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.



ఎగువ అహోబిలంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

'దిగువ'లో నేడు కల్యాణోత్సవం

అహోబిలం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి దిగువ అహోబిలంలో లక్ష్మీనృసింహస్వామి తిరు కల్యాణోత్సవం జరగనుంది. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, సాయంత్రం గజ వాహన సేవ జరగనుంది. ఎగువ అహోబిల క్షేత్రంలో జ్వాలా నరసింహస్వామికి అర్చకులు ఉత్సవం, తొట్టి తిరుమంజనం, అశ్వ వాహన సేవ నిర్వహిస్తారు.



ఉభయదేవేరులతో వేణుగోపాలునిగా ఊయలలో విహరిస్తున్న స్వామివారు



స్వామి, అమ్మవార్లను కల్యాణ మండపానికి తోడ్కొని వస్తున్న పీఠాధిపతి, వేదపండితులు

ఫార్మర్ రిజిస్ట్రీతో విప్లవాత్మక మార్పులు

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఇక నుంచి ప్రతి రైతుకు ఆధార్ తరహాలో విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధారంగా వ్యవసాయం, అనుబంధ శాఖల పథకాలతో పాటు రాయితీలను వర్తింపజేయనున్నారు. ఇంతకాలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, సేవలను అందుకుంటున్న అనర్హులకు అడ్డుకోవడం, అర్హులైన రైతులకు నేరుగా లబ్ధి చేకూరేందుకు ఈ విధానాన్ని తీసుకొచ్చారు. ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన నిర్దిష్టమైన గుర్తింపు సంఖ్యను ఇచ్చేందుకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఇప్పటికే జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్నట్లయితే వారికి విశిష్ట సంఖ్యను జారీ చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. ఇక నుంచి రైతులకు అందించే పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సేవలను పొందేందుకు ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది.



ఆత్మకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు కేంద్ర ప్రభుత్వం తరపున పలు పథకాలు, రాయితీలు అమలువుతున్నాయి. వీటికిగాను రాష్ట్రాల్లో ఉన్న వ్యవసాయ భూములు, పంటల వివరాలు మాత్రమే కేంద్రానికి సమాచారం అందుతున్నాయి. కానీ వ్యక్తులుగా రైతుల వారీగా పంటలు, పశుసంపద, ఇతర సమాచారం సమగ్రంగా అందడం లేదు. దీనికి ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డుల జారీ ద్వారా రైతుల పంటలు, వారి వద్ద ఉన్న పశు సంపద, అందుతున్న రాయితీ పథకాలు తదితర సమగ్ర సమాచారం కేంద్ర ప్రభుత్వానికి చేరనుంది. తద్వారా అర్హులైన రైతులకు పారదర్శకంగా పథకాలను, రాయితీలను అందించేందుకు ఈ సంఖ్య దోహదపడనుంది. వాస్తవానికి వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేయడానికి 2024-25 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రూ.2817 కోట్ల నిధును కేటాయించింది. ఈ నిధుల ద్వారా రైతుల విశిష్ట గుర్తింపు కార్డుల జారీకి అవసరమైన సమగ్ర సమాచారాన్ని సేకరించి డిజిటలైజ్ చేయాలని భావిస్తోంది. ఇందుకు దేశంలో మొత్తం 19 రాష్ట్రాలు విశిష్ట గుర్తింపు సంఖ్యతో కూడిన కార్డులను జారీ చేసేందుకు కేంద్రంతో ఒప్పందం చేసుకున్నాయి.



విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రయోజనాలు ఇలా

రైతు సేవా కేంద్రాల ద్వారా జారీ అయిన విశిష్ట సంఖ్య ద్వారా అవసరమైన సమయాల్లో అర్హులైన రైతులను అధికారులే గుర్తిస్తారు. వారికి ఆయా రాయితీ పథకాలను వర్తింపజేసేందుకు అవగాహన కల్పిస్తారు. ప్రత్యేకించి రైతులకు పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ, రాయితీపై సూక్ష్మపోషకాలు, సూక్ష్మసేద్యం, పంట రుణాలు, పెట్టుబడి సాయం, ధాన్యం కొనుగోలు, సాగునీటి సమస్యలు తదితర పథకాలను పారదర్శకంగా లబ్ధి పొందడమే కాకుండా పంటల తెగుళ్లు, ఇతర వ్యవసాయ సలహాలు, సూచనలు కూడా వ్యవసాయాధికారుల నుంచి నేరుగా పొందేందుకు అవకాశం ఉంటుంది.



బాపనంతాపురం గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకుంటున్న రైతులు

అర్హులు ఎవరంటే..

వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు అర్హులే. రైతులు తమ అధార్ నంబరు, దానికి అనుసంధానించిన సెల్‌ఫోన్ నంబరు, భూమి రికార్డుల వివరాలు (పట్టాదారు పాసుపుస్తకం) తీసుకొని రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే)లో సంప్రదించినట్లయితే రైతు సమక్షంలోనే వారు ఇచ్చిన ఆధారాలతో ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేయగా సెల్‌ఫోన్‌కు వచ్చే ఓపీటీపీ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసి విశిష్ట గురింపు సంఖ్య రానున్నారు. ఆ తర్వాత కొన్ని రోజులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను కూడా మంజూరు చేయనున్నారు. అందుకే ప్రతి రైతు విధిగా ఆర్ఎస్‌కేలను సంప్రదించి విశిష్ట సంఖ్యను పొందాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఇక నుంచి ఆయా పథకాల లబ్ధికి ఆధార్ కార్డు, ఇతర ధృవీకరణ పత్రాలతో అవసరం లేకుండా నేరుగా విశిష్ట సంఖ్యనే ఉపయోగపడుతుంది. ఈ సంఖ్య లేనట్లయితే రైతులకు పథకాలు వర్తించవని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాగా ప్రస్తుతం భూమి ఉన్న రైతులకు మాత్రమే విశిష్ట గుర్తింపు సంఖ్య రానుండగా, త్వరలో కౌలు రైతులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, ఇతర వ్యవసాయ ఆధారిత వృత్తుల్లో ఉన్న వారికి కూడా వర్తింపజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

నంద్యాల జిల్లాలో వ్యవసాయ సమాచారం

వ్యవసాయ భూములు	: 4,12,601 హెక్టార్లు
ఉద్యాన భూములు	: 64,263 హెక్టార్లు
పట్టు పరిశ్రమ	: 1023.47హెక్టార్లు
మత్స్య పరిశ్రమ	: 350 హెక్టార్లు
చిన్న, సన్నకారు రైతులు	:2,73,391
మధ్యకారు రైతులు	: 61,638
పెద్ద రైతులు	: 858



విశిష్ట గుర్తింపు కార్డులతో ప్రయోజకరం

ప్రభుత్వం జారీ చేసిన విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు చాలా ప్రయోజనం కలుగుతుంది. ఇంతకాలం ఆధార్ కార్డు ప్రామాణికంగా పథకాల మంజూరు జరిగేవి. అయితే పథకాలు, రాయితీలు మరింత పారదర్శకంగా ఉండేందుకు 11 అంకెలతో కూడిన నెంబర్‌ను ప్రభుత్వం రైతులకు ఇస్తుంది. దీని వల్ల సమగ్ర సమాచారం డిజిటలైజ్ అవుతుంది. రైతు సేవా కేంద్రాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ అవుతుంది.

- విష్ణువర్థన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి ఆత్మకూరు



- వ్యవసాయ పథకాల వర్తింపులో పారదర్శకత
- రైతు సేవా కేంద్రాల ద్వారా విశిష్ట గుర్తింపు సంఖ్య

గ్లకోమా.. సైలెంట్ కిల్లర్..

- జిల్లాలో 10 నుండి 15 శాతం కేసులు
- నేడు వరల్డ్ గ్లకోమా డే



కర్నూలు హాస్పిటల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శరీరంలో అతి ముఖ్యమైన, సున్నితమైన భాగం కన్ను. మనకు దారి చూపే కంటిపై నీటి కాసులు (గ్లకోమా) అనే వ్యాధి గుట్టుచప్పుడు లేకుండా కంటి దొంగలా వచ్చి చూపును దోచేస్తుంది. మన శరీరంలో బీపీ ఎలాంటిదో.. కంటికి ప్రత్యేకంగా గ్లకోమా అలాంటిది. బీపీ పెరిగితే.. గుండె జబ్బులు ఎలా వస్తాయో.. అదే విదంగా కంటిలో ఒత్తిడి పెరిగితే గ్లకోమా వస్తుంది.

గ్లకోమా వల్ల మన దేశంలో 12.8 శాతం ప్రజలను అంధులుగా చేస్తుంది. ఇంత ప్రమాదాన్ని తెచ్చి పెట్టే గ్లకోమా గురించి ఇప్పటి వరకు ప్రజలకు అవగాహన లేదు. అందుకే మార్చి 12వ తేదీ వరల్డ్ గ్లకోమా డే గా గ్లకోమా వారోత్సవాలను ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది గ్లకోమా రహిత ప్రపంచం కోసం ఐక్యత అన్ని నినాదాన్ని ఇచ్చింది.

40 ఏళ్ల తర్వాత :40 ఏళ్లను దాటిన తర్వాత ప్రతి ఒక్కరూ ఒక్కసారి కంటి పరీక్షలు చేయించుకోవాలి. స్మార్ట్ ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌లో పని చేస్తున్నప్పుడు చుట్టూ తగినంత లైటింగ్ ఉండేలా చూసుకోవాలి. చీకటిలో పని చేయకూడదు. ప్రతి అరగంటకు ఐదు నిమిషాల విరామం తీసుకోవాలి.

గ్లకోమా లక్షణాలు

- 40 ఏళ్లు పైబడిన వారు తరచుగా అద్దాలు మార్చాల్సి రావడం, తలనొప్పి రావడం
- మసక వెలుతురులో వస్తువులను గుర్తించడం ఆలస్యం అవడం..
- కంటి చూపు క్రమేపీ తగ్గడం
- వెలుతురు బల్బ్‌ను చూసినప్పుడు వాటి చుట్టూ రంగులు కనిపించడం
- కంటిలో ఒత్తిడి పెరిగినప్పుడు కన్ను ఎర్రగా మారడం

గ్లకోమా నిర్ధారణ

- అక్షరపటం చదివే సాధారణ కంటి పరీక్ష
- స్లీట్ లాంప్ (మైక్రోస్కోప్) పరీక్ష
- అప్లనేషన్ టోనోమీటర్ అనే పరికరంతో కొలుస్తారు. అప్పుడప్పుడు వేరువేరు సమయాల్లో ఒత్తిడి పరీక్షించాల్సిన అవసరం రావచ్చు.
- గ్లకోమా ఏ రకమో నిర్ధారించడానికి కంటి కోణాన్ని గోనియోస్కోప్ అనే పరికరంతో పరీక్షిస్తారు.
- వ్యాధి నిర్ధారణ చేయడానికి ఆటోమేటిక్ ఫీల్డ్ లేదా పెరిమెట్రీ పరీక్ష నిర్వహిస్తారు. తొలి దశలో గ్లకోమాను కేవలం గుర్తించగలుగుతారు.

ఈ జాగ్రత్తలు

- వంశపారంపర్యంగా గ్లకోమా వచ్చే అవకాశం ఉంది. కాబట్టి వీరు క్రమం తప్పకుండా కంటి పరీక్ష, కంటి ఒత్తిడి పరీక్షలు చేయించుకోవాలి.
- స్టెరాయిడ్స్ వాడకం పూర్తిగా తగ్గించాలి
- రక్తపోటు, మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవాలి.
- కంట్లో ఒత్తిడిని తగ్గేందుకు యోగా, వ్యాయామాలు చేయాలి.

ప్రాంతీయ కంటి ఆసుపత్రికి గ్లకోమా కేసులు

కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ప్రతి రోజు 300 నుంచి 400 మంది దాకా ఓపీ రోగులు వస్తుంటారు. ఇందులో అడ్మిషన్‌లు 20 మంది దాకా వార్డులో చేరుతుంటారు. ఇందులో 10 నుంచి 15 శాతం మంది గ్లకోమా వ్యాధి తో బాధపడుతుంటారు.



కంటి ఒత్తిడి వల్ల గ్లకోమా



గ్లకోమా అనేది కంటిలోని ఒత్తిడి పెరగడం వల్ల కలిగే ఆప్టిక్ నాడిని దెబ్బతీసే కంటి వ్యాధుల సమూహం. కంటి నుంచి మెదడుకు దృశ్య సమాచారాన్ని ప్రసారం చేయడానికి బాధ్యత వహించే ఆప్టిక్ నాడికి కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తుంది. సకాలంలో చికిత్స అందించకుంటే పూర్తిగా అంధత్వానికి దారి తీస్తుంది. ఈ వ్యాధికి కంటి మందులు, లేజర్ చికిత్స, శస్త్ర చికిత్స ద్వారా ఉన్న కంటి చూపు దెబ్బతినకుండా కాపాడవచ్చు.

- డా.ఏ. విజయలక్ష్మి, గ్లకోమా స్పెషలిస్టు, సుశీల నేత్రాలయ, కర్నూలు


ప్రతి రోజు గ్లకోమా, రెటీనా పరీక్షలు



కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ఓపీకి వచ్చే రోగులకు కంటి పరీక్షలతో పాటు రెగ్యులర్‌గా గ్లకోమా, రెటీనా పరీక్షలు నిర్వహిస్తాం. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు వరల్డ్ గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. జిల్లా ప్రజలకు గ్లకోమా పై అవగాహన సదస్సులను ఏర్పాట్లు చేస్తున్నాము.

- డా.పృథ్వీ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రి

లక్షణాలు కనిపించవు



ప్రారంభంలో గ్లకోమాకు ఎటువంటి లక్షణలు కనిపించవు. దీన్ని గుర్తించేసరికి వ్యాధి ముదిరిపోతుంది. కంటి నరాల్లో ఒత్తిడి పెరిగి హటాత్తుగా కన్ను నొప్పి రావడం, తలనొప్పి, చూపు మసకబారదం, కాంతి చుట్టూ వలయాలుగా కనిపించడం లక్షణాలు కనిపిస్తాయి. గ్లకోమా వ్యాధి ఉన్న వారు 6 నెలలకు, 40 ఏళ్ల దాటిన వారు ఒక సంవత్సరానిక ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి.

- డా.పి. సుధాకర్‌రావు, సీనియర్ కంటి వైద్య నిపుణుడు, సుశీల నేత్రాలయ, కర్నూలు

సంగమేశ్వరంలో స్పీడ్ బోటు బోల్తా

ఎక్స్‌కవేటర్ సాయంతో బయటికి తీసిన అటవీ అధికారులు



నీటమునిగిన స్పీడ్‌బోటును ఒడ్డున చేర్చేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం

కొత్తపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరంలోని కృష్ణానదిలో ఇంకా ప్రారంభానికి నోచుకోని అటవీ శాఖకు చెందిన ఓ స్పీడ్ బోటు అలల తాకిడికి బోల్తా పడింది. ఇటీవలనే అటవీ అధికారులు కాకినాడ నుంచి సంగమేశ్వరం తెచ్చిన నూతన స్పీడ్ బోటును అటవీ అధికారుల పర్యవేక్షణలో సంగమేశ్వరం నుంచి నది జలాల మీదుగా శ్రీశైలానికి పంపించాల్సి ఉంది. ఇంకా ప్రారంభానికి నోచుకోని ఏసీ స్పీడ్ బోట్‌ను నదిలోనే తాళ్లతో కట్టి ఉంచినప్పటికీ అలల తాకిడికి బోల్తా పడి మునిగిపోయింది. గత రెండు రోజులుగా ఆత్మకూరు రేంజ్ అధికారి పట్టాభి పర్యవేక్షణలో సిబ్బందితో పాటు పరిసర ప్రాంతాల మత్స్యకారుల సాయంతో బోటును నది ఒడ్డుకు చేర్చేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఎట్టకేలకు సోమవారం మధ్యాహ్నం ఎక్స్‌కవేటర్ సాయంత్రం స్పీడ్ బోటును నది ఒడ్డుకు చేర్చారు. సుమారు 14 మంది ప్రయాణించే ఈ స్పీడు బోటుకు ఏమీ కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

నంద్యాల ఈఎస్ఐని అప్‌గ్రేడ్ చేయండి



కేంద్ర మంత్రితో మాట్లాడుతున్న ఎంపీ శబరి

నంద్యాల హాస్పిటల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా కేంద్రంలో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ మంగళవారం కేంద్ర శ్రమ, ఉపాధి మంత్రి మాన్‌సున్ మాండవీయను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 3.75 లక్షల మంది కార్మికులు ఉన్నారని, వీరిలో చాలా మంది నిర్మాణ, వ్యవసాయ, తయారీ పరిశ్రమలలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం నంద్యాలలో ఒక ఈఎస్ఐ డిస్పెన్సరీ మాత్రమే ఉందని, ఈ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. దీనివల్ల వేలాది మంది కార్మికులకు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు, అత్యవసర చికిత్సలు అందుబాటులోకి వస్తాయని మంత్రికి వివరించారు.

పొగాకు రైతుకు తిప్పలు

రాత్రింబవళ్లు జాగరణ

ఓర్వకల్లు మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో పొగాకు బేడ్లను విక్రయించేందుకు రైతులకు తిప్పలు ఎదురయ్యాయి. పొగాకు విక్రయించేందుకు గోడౌన్లు, రహదారులపై రైతులు జాగారణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మంగళవారం పొగాకు విక్రయించేందుకు భారీ వాహనాలు నిలిచిపోయాయి. ఓర్వకల్లు మండలంలో వీఎస్‌టీ, ఐటీసీ బొంబిడాళ్ల, డెక్కల్, రిలయన్స్ కంపెనీలు పొగాకును కొనుగోలు చేస్తున్నారు. పొగాకు బేడ్లను విక్రయించేందుకు నంద్యాల, కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలు తెలంగాణ రాష్ట్రంలోని రాయచూరు తదితర రైతులు పొగాకు విక్రయించేందుకు ఓర్వకల్లుకు వస్తున్నారు. అయితే.. పొగాకు రైతులకు భోజన వసతి, నీటి సౌకర్యం కల్పించాల్సి ఉండగా.. ఒకే ఒక కంపెనీ జీపీఐ మాత్రమే రైతులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. మిగతా ఆరు కంపెనీలు రైతులను పట్టించుకునే దాఖలాలే కరువయ్యాయి. పొగాకు నాటే ముందు ప్రతి రైతు పొగాకును కొంటామని వాగ్దానం చేసిన కంపెనీలు నేడు తడి ఉందని పొగాకు వెనక్కు పంపడంతో రాను పోను రవాణా చార్జీల భారం పెరుగుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పొగాకు క్వింటం రూ.16వేలకు కొనుగోలు చేయాలని ఆయా కంపెనీలను రైతులు కోరారు. విక్రయించేందుకు వచ్చే రైతులకు కంపెనీ యజమాన్యం భోజనం, మంచి నీటి సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.



ఓర్వకల్లులో పొగాకును విక్రయించేందుకు భారీగా నిలిచిన వాహనాలు

రుధిర ధారులు

(5వ పేజీ తరువాయి)

ఆదోని మండలం పాండవ గల్లు గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆదోని మండలం కుప్పగల్లు గ్రామానికి చెందిన యువరైతు దంపతులు కురవ పూజారి ఈరన్న (25), మూడు నెలల గర్భవతి పూజారి ఆదిలక్ష్మి (వీరిద్దరు టీడీపీ కార్యకర్తలు), కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వి పట్టణంలో అగ్నిమాపక విభాగంలో హోంగార్డుగా పని చేస్తున్న మంగలి హేమాద్రి (40), ఆయన భార్య నాగరత్న (35), కుమారుడు మంగలి దేవరాజు (20) ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. కుప్పగల్లుకు చెందిన పూజారి ఈరన్న భార్య పూజారి ఆదిలక్ష్మి మూడు నెలల గర్భవతి. ఆమెకు స్వల్పంగా రక్తస్రావం అవుతుండడంతో ఆదోనిలో చికిత్స, నెలవారి వైద్య పరీక్షల కోసం మూడేళ్ల కూతురు సుస్మితను అవ్వతాతలు వీరేషమ్మ, రామన్నల వద్ద వదిలిపెట్టి.. ఉదయం 9:30 గంటల సమయంలో ఏపీ21 బీజే 4324 ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అలాగే చర్మ సంబంధిత జబ్బుకు ఆదోని మండలం ఇస్వీలో నాటు వైద్యం కోసం తెల్లవారుజామునే కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వి పట్టణానికి చెందిన అగ్రిమాపక శాఖ హోంగార్డు మంగలి హేమాద్రి (40) భార్య నాగరత్న (35), కుమారుడు మంగలి దేవరాజు (20)తో కేఏ 36 హెచ్‌డీ 8129 మోటర్ బైక్‌పై బయలుదేరారు. ఈ రెండు జంటలు వెళ్తున్న బైకులు సుమారుగా 10 గంటల సమయంలో పాండగల్లు గ్రామం దాటి జాలిమంచి క్రాస్ రోడ్డు చేరుకున్నాయి. మరో 15-20 నిమిషాల్లో గమ్యానికి చేరుకోబోతుండగా.. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు కేఏ 37 ఎఫ్ 0711 వీరి ద్విచక్ర వాహనాలను ఒకదాని తరువాత ఒకదాన్ని వేగంగా ఢీకొంది. బైకులను ఢీకొట్టిన బస్సు.. అదే వేగంలో పొలంలోకి దూసుకెళ్లి ఓ వేపచెట్టును ఢీకొట్టగా ఆ చెట్టు వేళ్లతో సహా ధ్వంసమైంది. కుప్పగల్లుకు చెందిన భార్యభర్తలు ఈరన్న, ఆదిలక్ష్మి మృతదేహాలు బస్సు చక్రాల కిందే నలిగిపోగా.. మాన్వికి చెందిన తల్లికొడుకులు నాగరత్న, దేవరాజుల మృతదేహాలు రోడ్డు పక్క చెల్లాచెదురుగా పడిపోయాయి. తీవ్రమైన గాయాలతో రక్తపుమడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న హోంగార్డు మంగలి హేమాద్రిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. చికిత్స పొందుతూ నిమిషాల్లోనే ఊపిరి వదిలారు. మృతుల బంధువులతో ఆస్పత్రి శోకసంద్రంగా మారింది.


మృతి చెందిన హేమాద్రి


అక్కడిక్కడే మృతిచెందిన నాగరత్న


ప్రమాద స్థలంలో విగత జీవిగా పడి ఉన్న దేవరాజు


గుండెలవిసేలా రోదిస్తున్న మృతుల బంధువులు

ఊరుగాని ఊళ్లో మృత్యువాత

కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వి పట్టణంలో మంగలి హేమాద్రి అగ్నిమాపక శాఖలో హోంగార్డుగా పని చేస్తున్నారు. భార్య నాగరత్న, కొడుకు దేవరాజు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూరుతుకు పెళ్లి చేయగా.. మిగిలిన ముగ్గురు కూతుళ్లు 7,8,10వ తరగతి చదువుతున్నారు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న దేవరాజు స్థానిక సెలూన్ షాపులో కులవృత్తి పని చేస్తూ నాన్నకు తోడుగా ఉన్నాడు. హేమాద్రికి చర్మసంబంధిత సమస్యలు తలెత్తాయి. అక్కడి డాక్టర్లకు చూపించిన తగ్గకపోగా.. రోజురోజుకు పెరుగుతూ రావడంతో.. ఆదోని మం డలం ఇస్వీ గ్రామంలో నాటు వైద్యం చేస్తారు. తగ్గిపోతుందని తెలిసిన వాళ్లు చెప్పడంతో.. మంగళవారం సెలూన్ షాప్‌కు సెలవు ఉందని దేవరాజు బైక్‌పై నాన్న హేమాద్రి, అమ్మ నాగరత్నలను ఎక్కించుకొని దాదాపు 100 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఇస్వీకి బయలుదేరారు. ఊరుగాని ఊళ్లో రోడ్డు ప్రమాదానికి తల్లిదండ్రులు, కొడుకు ముగ్గురు విగతజీవులుగా మారారు. కన్నవాళ్లను కోల్పోయి..మాకెవ్వరు దిక్కు అంటూ కుమార్తెలు బోరున విలపించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న మీనాక్షి నాయుడు

మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ విచారం

పాండవగల్లు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడడంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌లు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. కర్ణాటక బస్సు ఢీకొని కుప్పగల్లుకు చెందిన టీడీపీ కార్యకర్తలు పూజారి ఈరన్న, ఆదిలక్ష్మి దంపతులు, కర్ణాటక వాసులు ముగ్గురు మృతి చెందడం అత్యంత బాధాకర మని లోకేశ్ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ఆధికా రులు, ఆదోని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడులను వాకాబు చేశారు. టీడీపీ కార్యకర్తల కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా ప్రమాద ఘటనపై ఎస్పీ, కలెక్టర్లతో మంత్రి టీజీ భరత్ మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు ఆస్పత్రికి చేరుకొని రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను పరామర్శించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

పాండగల్లు రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కర్ణాటక ఆర్టీసీ బస్సును, ఘటన స్థలంలో చెల్లాచెదురుగా పడిపోయిన ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎస్పీ వెంట ఆదోని డీఎస్పీ హేమలత, ఆదోని రూరల్ సీఐ నల్లప్ప, పెద్దతుంబళం మహేశ్‌కుమార్ ఉన్నారు.

14 మంది ప్రాణాలు పాడిన వేప చెట్టు

బస్సులోని 14మంది ప్రయాణికులను ఓ వేపచెట్టు కాపాడింది. ఆదోని నుంచి మంత్రాలయానికి వేగంగా వెళ్తున్న కర్ణాటక బస్సు ప్రమాదం జరిగిన స్థలానికి ముందు ఉనన కల్వర్టును దాటే క్రమంలో వేగాన్ని నియంత్రించుకోలేక డ్రైవర్ ఎడమ నుంచి కుడికి బస్సును తిప్పడం.. అదే సమయంలో రోడ్డుకు వెళ్తున్న మోటర్ బైక్‌లను ఢీకొట్టి.. పొలాల్లోకి దూసుకుపోయి వేప చెట్టును ఢీకొట్టి బస్సు ఆగిపోయింది. చెట్టు వేళ్లతో సహా కింద పడిపోయిందంటే ఎంత వేగంతో ఢీకొట్టి ఉంటుందో అంచనా వేయవచ్చు. చెట్టే లేకపోయి ఉంటే బస్సు పల్టీలుకొట్టి 14 మంది చనిపోయేవారు.

అయ్యో సుస్మిత..!



ఆదోని మండలం కుప్పగల్లు గ్రామానికి చెందిన రైతు దంపతులు కురవ పూజారి రామన్న, వీరేశమ్మ దంపతులకు ఏకైక కుమారుడు పూజారి ఈరన్న. తమకున్న పొలంలో సేద్యం చేస్తూ జీవనం సాగిస్తు న్నారు. అదే మండలం కె.నాగులాపురం గ్రామానికి చెందిన చిన్న ఉచ్చీరప్ప, ఉరుకుందమ్మ దంపతుల కుమార్తె ఆది లక్ష్మితో నాలుగేళ్ల క్రితం ఈరన్న వివాహం జరిపించారు. వీరికి మూడేళ్ల సుస్మిత సంతానం. ఆదిలక్ష్మి మళ్లీ గర్భం దాల్చింది. మూడు నెలల గర్భవతి ఆదిలక్ష్మికి స్వల్పంగా రక్తస్రావం కావడం, నెలవారి వైద్య పరీక్షల కోసం ఆదోని వెళ్తుతూ ఈ ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. 'మమ్మీ, డాడీ ఎప్పుడు వస్తారు..' అని ఆ చిన్నారి అడుగుతుంటే.. సమాధానం చెప్ప లేని స్థితిలో బంధువులు విలపించారు. అమ్మానాన్నలు లేరని, తోబుట్టువు ఇక రాదని తెలియక అమాయకంగా.. దీనంగా చూస్తున్న ఆ చిన్నారి తల్లిదండ్రుల కోసం ఎదురుచూసింది.

దటీజ్ పోలీస్..

పాండవగల్లు దగ్గర రోడ్డు ప్రమాదం జరిగిందనే సమాచారం రాగానే ఆదోని డీఎస్పీ హేమలత, ఆదోని రూరల్ సీఐ నల్లప్ప, వన్‌టౌన్ సీఐ శ్రీరామ్, పెద్దతుంబళం ఎస్ఐ మహేశ్ కుమార్ సహా సిబ్బంది హుటాహుటినా ఘటన స్థలానికి చేరుకున్నారు. పొలంలో వేప చెట్టును ఢీకొని కర్ణాటక ఆర్టీసీ బస్సు ఆగిపోయింది. క్షతగాత్రులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. వాళ్లు బతికే ఉన్నారా..! అంటూ ఒక్కొక్కరిని పరిశీలించారు. రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న కర్ణాటక వాసి హోంగార్డు హేమాద్రిని పోలీస్ జీపులో ఎక్కించి ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుప్పగల్లుకు చెందిన భార్యభర్తలు పూజారి ఈరన్న, ఆదిలక్ష్మి, కర్ణాటక రాష్ట్రం మన్వికి చెందిన నాగరత్న, దేవరాజు ఘటన స్థలంలోనే మృతి చెందారని పోలీసులు నిర్ధారించుకొని.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఆస్పత్రికి తరలించేందుకు ఆటోలు సిద్ధం చేశారు. అప్పటికే వందలాది మంది చేరుకొని 'అయ్యో పాపం.. ఎంత ఘోరం జరిగింద'ని జాలి చూపుతున్నారే తప్పా.. మృతదేహాలను ఆటోలో ఎక్కించేందుకు ఏ ఒక్కరు కూడా ముందుకు రాలేదు. సీఐలు నల్లప్ప, శ్రీరాం, ఎస్ఐలు మహేశ్‌కుమార్, నాగేంద్ర, రామాంజనేయులు మృతదేహాలను ఆటోలోకి చేర్చారు. స్థానికులు ఒకరిద్దరు పోలీసులకు సహకరించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ గంగవతికి చెందిన మహ్మద్ సాబ్‌లాతి ప్రమాదం జరిగిన వెంటనే పారిపోయారని పోలీసులు తెలిపారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

కొత్తపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపురం గ్రామ శివారులో హరికృష్ణ యాదవ్ (35) అనే వ్యక్తి బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొని మంగళవారం రాత్రి మృతి చెందారు. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాలివీ.. శివపురం గ్రామానికి చెందిన హరికృష్ణ యాదవ్ ఆత్మకూరు మండలం కొట్టాలచెరువులో బంధువుల లింగస్వామి దేవుడి కార్యక్రమం నిర్వహిస్తుండగా.. ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో బైకుపై వస్తూ మంగళవారం రాత్రి శివపురం గ్రామ శివారులోని జంబులమ్మ గుడి వద్ద ఉన్న ఓ విద్యుత్ స్థంభాన్ని బైక్‌పై అదుపు తప్పి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హరికృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. కోలుకోలేక మృతి చెందారు. హరికృష్ణకు భార్య కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఆత్మకూరు రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈమండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన షేక్ ముర్తుజావలి (25) మంగళ వారం విద్యుదాఘాతతో మృతి చెందాడు. ఆత్మకూరు ఏఎస్ఐ శంకర్ రెడ్డి తెలిపిన వివరాలివీ.. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెం దిన షేక్ ముర్తుజావలి తాను చేస్తున్న గౌండా పని ముగించుకుని సాయంత్రం మంగళవారం ఇంటికి వచ్చి ఇంట్లో స్నానం చేస్తున్న సమయంలో బాత్‌రూంలో ఉన్న ఓ వైరు మీద టవల్ ఆరవేశాడు. స్నానం పూర్తయిన తర్వాత ఆ టవల్ తీసుకునే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. ఇది గమనించిన ఇంట్లోని కుటుంబసభ్యులు హుటాహుటిన ముర్తుజాను గ్రామస్థుల సహకారంతో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే షేక్ ముర్తుజా మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడు ముర్తుజాకు భార్య ఆసియాతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. యువకుడి తండ్రి షేక్ మహబూబ్ బాషా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.


ముర్తుజావలి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి ..

నందవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకల దోన గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలివీ.. చిలకలదోన గ్రామ సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాల దగ్గర రోడ్డు దాటుతున్న వ్యక్తిని బెంగళూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న కర్ణాటకకు చెందిన బస్సు ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 లోపు ఉంటుందని పింక్ కలర్ ఫుల్ హాండ్ టీ షర్ట్, గ్రే కలర్ లోయర్ దానిపైన రెడ్ కలర్ షార్ట్ వేసుకున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121101150 కు ఫోన్ చేయాలని పోలీసులు తెలిపారు.

రాయలసీమ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

- పార్లమెంట్‌లో ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కరువుతో పోరాడుతున్న రాయలసీమను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఎంపీ బస్తిపాటి నాగారాజు కోరారు. మంగళవారం పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ సరైన నీటి వసతులు లేక సీమ జిల్లాలు కరువుతో అల్లాడుతున్నాయని అన్నారు. రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, కేవలం 25 శాతం మాత్రమే పంటలు సాగవుతుండటంతో ప్రతి ఏడాదీ రైతుల, వ్యవసాయ కూలీలు, ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని తెలిపారు. రాయలసీమలోని నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని అందులో భాగంగా పోలవరం, బనకచర్ల నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు: ఎస్పీ

ఆలూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆలూరు పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను సీఐ వెంకట చలపతి, ఎస్ఐ దిలీప్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆలూరు సబ్ జైలు 15 ఏళ్లుగా మరమ్మతుల పేరిట మూతపడిందని విలేకరులు ప్రస్తావించగా, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఎస్పీ చెప్పారు.


ఆలూరులో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

హొళగుంద: సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. హొళగుంద పోలీస్ స్టేషన్, మార్లమాడికి చెకపోస్టును పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

విచారించి కేసులు నమోదు చేస్తాం

జర్నలిస్టులపై కొందరు ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ దృష్టికి తీసుకువెళ్లారు. విచారణ చేసి కేసులు నమోదుచేస్తామని, నిజాయితీగల వ్యక్తులపై అక్రమ కేసులు నమోదు చేస్తే ఆ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేసామని ఎస్పీ చెప్పారు. ఆలూరు సీఐ వెంకటచలపతి, ఎస్ఐ బాల నరసింహులు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ అక్బరుద్దీన్ పాల్గొన్నారు.

యువత పోరు జగన్ ఇంటి ముందు చేయాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ దొంగల ముఠా అంతా కలిసి జగన్ ఇంటి ముందు యువత పోరు ధర్నా చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఈనెల 12న తలపెట్టిన యువత పోరు నాటకాన్ని తాడేపల్లిలోని జనగ్ ఇంటి ముందు ప్రదర్శించాలని ఎద్దేవా చేశారు. గతంలో జగన్ విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజ్ రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన సకాలంలో చెల్లించకుండా విద్యార్థుల చేతికి సరైన సర్టిఫికెట్లను అందకుండా చేసి ఎంతోమంది విద్యార్థులను రోడ్డు పాలు చేశారని అన్నారు. ఇప్పుడేమో విద్యార్థుల పట్ల మొసలి కన్నీరు కార్చేందుకు యువత పోరు పేరుతో పిలుపు ఇచ్చారని ధ్వజమెత్తారు. 2014-2019 టీడీపీ పాలనలో ఏటా ఫీజు రీయింబర్స్ మెంట్ పంపిణీ చేస్తే జగన్ పాలనలో కేవలం 9 లక్షల మందికి.. అదీ విడతల వారీగా ఇచ్చారని మండి పడ్డారు.

ఇంటర్ పరీక్షకు 739 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 24,729 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. 23,979 మంది పరీక్షకు హాజరు కాగా, 739 మంది గైర్హాజరయ్యారు. కర్నూలు బి.క్యాంపు ఒకేషనల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ సెంటరులో మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన ముగ్గురు విద్యార్థులపై మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేసినట్లు ఆర్ఐవో గురువయ్య శెట్టి తెలిపారు. ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ఆధ్వర్యంలో డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జీ.లాలెప్ప, డీఈసీ కమిటీ సభ్యులు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

పోలీస్ స్టేషన్లకు 'పది' ప్రశ్న పత్రాలు

- పర్యవేక్షించిన డీఈవో, డీవైఈవోలు


ప్రశ్నపత్రాల తరలింపును పర్యవేక్షిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య 10వ తరగతి ప్రశ్నపత్రాలను జిల్లాలోని 12 రూట్‌లలోని ఆయా పోలీస్‌స్టేషన్‌లకు మంగళవారం తరలించారు. డీఈవో జనార్దన్‌రెడ్డి, డీవైఈవోలు శంకర్‌ప్రసాద్, వెంకట్రామిరెడ్డి, రూట్ ఆఫీసర్, మండల విద్యాధికారి రామసుబ్బయ్య పర్యవేక్షణలో శ్రీశైలం, ఆత్మకూరు, మహానంది, పగిడ్యాల, నంద్యాల వన్‌టౌన్, టూటౌన్, ఆళ్లగడ్డ, బేతంచర్ల, డోన్, ప్యాపిలి, నందికొట్కూరు, బనగానపల్లె సంబంధిత పోలీస్ స్టేషన్‌లకుతరలించారు.

ఒక్కో రూట్‌కు ఒక కానిస్టేబుల్, ఇద్దరు ఎంఈవోల చొప్పున కట్టుదిట్టమైన భద్రత మధ్య సంబంధిత రూట్‌లోని పోలీస్ స్టేషన్‌లకు చేరుకుని అక్కడ వాటిని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరించారు.

వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయండి

- రోగులకు మెరుగైన సేవలు అందించాలి
- మాతృ మరణాలు జరగకుండా వైద్య సేవలందించాలి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గర్భిణుల నమోదులో 85 శాతంలోపు పురోగతి చూపిన మండల వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా డీఎంహెచ్‌వోను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్య ఆరోగ్య అంశాలపై వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన జిల్లా అధికారులు, జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మెడికల్ ఆఫీసర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణిలను వంద శాతం పోర్టల్‌లో నమోదు చేసి వారికి సరైన వైద్యసేవలందించి మాతృమరణాలు జరగకుండా చూడాలని అన్నారు. చిప్పగిరి మండలంలో 89 శాతం మాత్రమే గర్భిణిలను రిజిస్టర్ చేశారని, సమస్య ఏమిటని మెడికల్ ఆఫీసర్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిం చాలన్న లక్ష్యంతో పని చేస్తోందన్నారు. నవజాత శిశువులను రిజిస్టర్ నమోదు, వైద్యసేవలు అందించడంతో కూడా ప్రత్యేక దృష్టి పెట్టాల న్నారు. ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) సర్వేకు సంబంధించి కూడా జనాభా అంతటికి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని వైద్యధికారులను ఆదేశించారు. సర్వేలో కోసిగి, తుగ్గలి మండలాలు వెనుకబడి ఉన్నాయని, పురోగతి సాధించాలన్నారు. ఎక్కడైనా ఏఎన్ఎంలు తక్కువగా ఉంటే డిప్యుటేషన్ చేసి రేషనలైజేషన్ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఎంహెచ్‌వో శాంతికళ, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగన్ నాటకాలను జనం నమ్మరు: ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో యువత భవిష్యత్తు మాజీ సీఎం జగన్ నాశనం చేశారని, ప్రస్తుతం యువత పోరుతో కార్యక్రమం పేరిట జగన్ చేస్తున్న నాటకాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రూ.4271 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలతో యువత జీవితాలతో చెలగాటం ఆడారని అన్నారు. 2014-19 చంద్రబాబు పాలనలో 16 లక్షల మంది విద్యార్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్ చేస్తే వైసీపీ హయంలో 9 లక్షలకు కుదిరించారని అన్నారు. అలాగే టీడీపీ హయాంలో 6లక్షల మందికి నిరుద్యోగ భృతి ఇవ్వగా జగన్ ప్రభుత్వం ఏకంగా రద్దు చేసినట్లు చెప్పారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీలపై హామీ ఇచ్చిన జగన్ మాట తప్పారని గుర్తుచేశారు. కమిషన్ల కోసం పరిశ్రమలపైనే దాడులు చేసి పెట్టుబడులను పొరుగు రాష్ట్రాలకు తరలించి రాష్ట్ర ప్రయోజనాలను నాశనం చేశారని ఆరోపించారు. ఇదిలావుంటే ఉద్యోగాల కల్పవృక్షం చంద్రబాబేనని కొనియాడారు. 2014-19 మధ్యలో 12 లక్షల మందికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయ, పోలీసు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 9నెలల వ్యవధిలోనే రూ.6.5లక్షల కోట్ల పెట్టుబడులతో 4లక్షల ఉద్యోగాల కృషి చేస్తున్నట్లు వివరించారు.

'బాధ్యతగా విధులు నిర్వహించాలి'

మిడుతూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మేట్‌లు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఏపీవో జయంతి సూచించారు. మిడుతూరులోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మండలంలోని మేట్‌లకు ఏపీవో ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మేట్‌ల ట్రైనర్ ఇస్మాయిల్, టీఏలు, మేట్‌లు పాల్గొన్నారు.

'పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

ఆత్మకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ తాలుకా కార్యదర్శి ప్రతాప్ కోరారు. మంగళవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి కార్యాలయ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు ముర్తుజావలి, అన్వర్, మాబాషా, షబ్బీర్, సయ్యద్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

పాములపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పాములపాడులో బీజేపీ మండల అధ్యక్షుడు మురళీమోహన్ అధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ మహిళలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చల్లా దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. బీజేపీ మహిళా మోర్చ నాయకులు గీతా మాధురి, వీరమ్మ, అనితా, జ్యోతి, సర్పంచ్ భాగ్యమ్మ వైద్యాధికారులు గులాబ్బా, సావిత్రి, ఏపీవో విమలమ్మ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో డీఈవో జనార్దన్‌రెడ్డి

పాణ్యం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొగర్చేడు ఎంపీయూపీ పాఠశాలను డీఈవో జనార్దన్ రెడ్డి మంగళవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులు చేసిన కృత్యాలను, అబాకస్ పరికరాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమైన రీతిలో టీఎల్ఎం ద్వారా బోధన చేయాలన్నారు. వెనుక బడిన విద్యార్థులకు అర్థమైన రీతిలో బోధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కోటయ్య, సుబ్రహ్మణ్యం, హెచ్ఎం సాంబశివుడు, అరుణ్‌కుమార్ నాయక్, యూనస్ బాషా, మాధవరెడ్డి, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

సచివాలయాలు..

పాములపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సచివాలయాలను ఆత్మకూరు డీఎల్‌డీవో సూర్యనారాయణ, పాములపాడు ఎంపీడీవో చంద్రశేఖర్‌తో కలసి తనిఖీ చేశారు. మంగళవారం మిట్టకందాల, మద్దూరు, బానకచెర్ల, వేంపెంట గ్రామాలలోని సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు అంశాలపై సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు.

28 మంది బైండోవర్

కొత్తపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో 28 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు కొత్తపల్లి ఎస్ఐ కేశవ తెలిపారు. మంగళవారం దుద్యాల, నందికుంట, గువ్వలకుంట్ల, కొత్తమాడుగుల, కొక్కెరంచ, శివపురం, ముసలిమడుగు, ఎర్రమటం, కపిలేశ్వరం, సింగరాజనపల్లె గ్రామాలకు చెందిన 28 మంది గతంలో మద్యం కేసులో నమోదైన వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. తహసీల్దార్ ఉమారాణి ఎదుట హాజరు పరిచామని తెలిపారు. అనంతరం పూచీకత్తుపై విడుదల చేశామని ఎస్ఐ తెలిపారు.

పేదల ఇంటి నిర్మాణానికి సహకారం: కలెక్టర్



సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80 లక్షలకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.లక్ష చొప్పున సాయం అందజేయనున్నట్లు తెలిపారు. హౌసింగ్ ఈఈ హరిహర గోపాల్, డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్యాన్ని అధిగమించాలి'

జాతీయ ఉపాధి హామీ పథకం కింద పెండింగ్‌లో ఉన్న 9లక్షల వేతనదారుల బడ్జెట్‌లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆమె మాట్లాడుతూ 80నుంచి 90రోజుల పనిదినాలకు చేరువలో ఉన్న కుటుంబాలను గుర్తించి వంద రోజులు పనిదినాలు పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆళ్లగడ్డ, బండిఆత్మకూరు, చాగలమర్రి, కొత్తపల్లె, రుద్రవరం, అవుకు తదితర 9మండలాలు లేబర్ బడ్జెట్‌లోవెనుకబడిఉన్నాయని, వెంటనే ప్రగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వందరోజుల పనిదినాల లక్ష్యంలో జిల్లా 13వ స్థానంలో ఉందన్నారు. డోన్ మండలంలో అన్ని పారామీటర్లలో వెనుకబడి ఉన్నారని, పనితీరు మెరుగుపరచుకోవాలని ఆదేశించారు. పశువుల షెడ్ల నిర్మాణానికి సంబంధించి 62శాతమే పూర్తిచేశారని మిగిలిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి: డీఏవో

పాములపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన మందుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని డీఏవో మురళీకృష్ణ సూచించారు. మండలంలోని చెలిమిళ్ళ గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ, స్థానిక ఏవో ఫణీశ్వరరెడ్డి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.,

ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి: ఆర్డీవో

పాములపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంపై ప్రజలకు అర్థమయ్యేలా అధికారులు వివరించాలని ఆర్డీవో నాగజ్యోతి సూచించారు. మండలంలోని పలు అంశాలపై పాములపాడు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో చర్చించారు. మండలంలో కంబాలపల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించిన రీ సర్వే వివరాలను రీసర్వే డీటీ సుప్రియను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే 322 మంది రైతులకు నోటీసులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, డీటీ పఠాన్‌బాబు, డీఐ ఉమాపతి సిబ్బంది పాల్గొన్నారు.

'చర్యలు తీసుకోవాలి'

నంద్యాల క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మత విద్వేషాలను రెచ్చగొట్టేవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముస్లిం జేఏసీ నాయకులు మంగళవారం నంద్యాల సబ్‌డివిజన్ పోలీస్ అధికారికి, నంద్యాల వన్‌టౌన్ సీఐకి వినతిపత్రం అందించారు. ఇటీవల గాంధీచౌక్‌లో జరిగిన ధర్నాలో కొందరు మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడారని, వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి నంద్యాలలో మతసామరస్యాన్ని కాపాడాలని కోరారు. నంద్యాల ముస్లిం జేఏసీ కో కన్వీనర్లు సద్దాం హుసేన్, మస్తాన్, ట్రెజరర్ ఎస్పీబాష, యూత్‌వింగ్ లీడర్ బాబుల్లా, మీడియా సెక్రటరి ఉస్మాన్, ఎస్‌డీపీఐ కలాం, ఐయూఎంఎల్ మౌలానా అబ్దుల్ సలాం, ఏఐఎంఐఎం సమీర్, రహమతుల్లా తబ్లిగి, కోహినూర్ మహబూబ్‌బాషా, సయ్యద్ అబ్దుల్ మునీర్, జాకీఉల్లా, జాకీర్‌అలీఖాన్, హ్యూమన్‌రైట్స్ అబ్దుల్లా, ఫయాజ్, షేక్ కుమార్, జమాల్ అహమ్మద్, కరీముల్లా, జాకీర్, నూరుల్లా, అబ్దుల్లా, హిదాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

'మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి'

వెలుగోడు మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో అన్ని రంగాల్లో రాణించాలని వెలుగు పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 6వరకు 40 మంది మహిళలకు స్కిల్ డెవలప్ మెంట్ ద్వార శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన మహిళలకు పీడీ చేతుల మీదుగా మంగళవారం సర్టిఫికెట్లు అందచేశారు. ఎల్డీఎం రవీంద్రబాబు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీ శ్రీకాంతరెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజరు సూర్యదేవర నాయక్, ఏరియా కో ఆర్డినేటర్ పుల్లయ్య, డీటీఎం బాబురావు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడాలి: ఎస్డీపీవో



బండిఆత్మకూరు స్టేషన్‌లో రికార్డును పరిశీలిస్తున్న ఎస్డీపీవో

బండిఆత్మకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఫ్యాక్షనిస్టులపై పోలీస్ నిత్యం నిఘా ఉంచి శాంతిభద్రతలను కాపాడాలని ఎస్డీపీవో జావళి ఆల్ఫోన్స్ సూచించారు. ఫ్యాక్షన్ ప్రాంతమైన భోజనం గ్రామంలో పోలీస్ పికెటింగ్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం బండిఆత్మకూరు స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

గడివేముల: మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన పెసరవాయిలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్‌ను మంగళవారం ఎస్డీపీవో జావళి అల్ఫోన్స్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు పికెట్ సిబ్బందిని గ్రామ పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్ ఆధ్వర్యంలో నంద్యాల రీజియన్ ప్రాంతీయ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూఎఫ్‌బీయూ నాయకులు వెంకటేశ్వర్లు, కిరణ్, రాజేశ్, రామ్మోహన్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు విధానాలకు అనుగుణంగా బ్యాంకుల్లో నియామకాలు చేపట్టి ఉద్యోగులపై పనిభారాన్ని తగ్గించాలని, బ్యాంకు సిబ్బందిపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెల 24, 25వ తేదీల్లో చేపడుతున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

నేటి 'యువత పోరు'ను జయప్రదం చేయండి: వైసీపీ



నందికొట్కూరు, ఆత్మకూరులో పోస్టరును విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం నంద్యాల జిల్లాలో చేపడుతున్న 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దారా సుధీర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టరును మంగళవారం నందికొట్కూరులో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడంతో ఈ కార్యక్రమం చేపడు తున్నట్లు తెలిపారు. వైసీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్ అహ్మద్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ నాయబ్, పుల్లాల నాగిరెడ్డి, జబ్బార్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వంలో యువతకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు బుధవారం చేపట్టనున్న యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసీపీ మండల, పట్టణాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆత్మకూరు వైసీపీ కార్యాలయంలో యువత పోరు కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలు, యువతకు జరుగుతున్న అన్యాయాలపై నంద్యాల కలెక్టరేట్‌లో బుధవారం జరిగే నిరసన కార్యక్రమానికి యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పాలిటెక్నిక్ కళాశాలకు యంత్రం విరాళం



యంత్రంతో విద్యార్థులు, అధ్యాపకులు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఇసుజు మోటార్స్ కంపెనీ కట్ సెక్షన్ ఇంజిన్‌ను విరాళంగా అందజేసింది. ఇసుజు కంపెనీ ప్రతినిధులు ప్రదీప్, మురళిలు రూ.3లక్షల విలువ చేసే కట్ సెక్షన్ ఇంజిన్‌ను మంగళవారం మెకానిక్ విభాగంలోని సంబంధిత ప్రయోగశాలకు విరాళంగా అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఇలాంటి అధునాతన మిషన్స్ ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ విభాగాధిపతులు రాజేశ్, శ్రీనివాసరెడ్డి, రఘునాథరెడ్డి, సంజీవరాయుడు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శాంతిరాం ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

పాణ్యం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం పార్మశీ కళాశాలలో మంగళవారం ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ చెట్టి తెలిపారు. దివీస్ ల్యాబోరేటరీ సంస్థ నిర్వహించిన ఈ నియామకాల్లో 41 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ. 2.5 లక్షలు వార్షిక వేతనం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో లేబరేటరీ హెచ్ఆర్ఏ మేనేజర్ హరికృష్ణ, ప్లేస్‌మెంట్, ట్రైనింగ్ సెల్ అధికారి డాక్టర్ ఏవీ బద్రీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

'నమోదు చేసుకోవాలి'

బండిఆత్మకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రైతులు విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని ఏడీఏ రాజశేఖర్ సూచించారు. మండలంలోని సంతజూటూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆర్ఎస్‌కేలో రైతులతో ఏడీఏ మాట్లాడుతూ పంట నమోదు చేయించాలని సూచించారు. ఏవో స్వాతి, వీఏఏ సింధూ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. దంపతులపై కేసు నమోదు

పగిడ్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొత్తముచ్చుమర్రి గ్రామంలో రంగడుపై అల్లరి మధు అలియాస్ బోయ మధు, ఆయన భార్య స్రవంతి మంగళవారం దాడి చేశారు. ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. బోయ రంగడు తన ఇంటి సమీపంలో పెంచిన బొప్పాయి చెట్టు కొమ్మలు తమ ఇంటి ఆవరణలోకి వచ్చాయని స్రవంతి చెట్లను నరికివేశారు. దీంతో రంగడు భార్య రత్నమ్మ చెట్లను ఎందుకు నరికివేస్తున్నావని అడగడంతో స్రవంతి దుర్భాషలాడుతూ గొడవకు దిగారు. దీంతో రత్నమ్మ భర్త రంగడు అక్కడికి రావడంతో వైసీపీ నాయకుడు మధు ఆయన చొక్కా కాలర్‌ను పట్టుకొని దాడి చేయగా, భార్య స్రవంతి కొడవలితో రావడంతో అక్కడి నుంచి రంగడు తప్పించుకొని పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పెద్ద రంగడు, ఆయన భార్య రత్నమ్మ ఫిర్యాదు మేరకు మధు, ఆయన భార్య స్రవంతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'ఈవోను విధుల నుంచి తొలగించాలి'



రోడ్డుపై నిరసన తెలుపుతున్న నాయకులు

నందికొట్కూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు దేవాలయాల ఈవో వెంకటరమణను విధుల నుంచి తొలగించాలని టీడీపీ, బీజేపీ, భజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్ నాయకులు మంగళవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కేజీ రోడ్డులోని సుంకులా పరమేశ్వరి ఆలయం వద్ద బైఠాయించారు. ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, రవి మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణంలోని సుంకులమ్మ ఆలయం, ఆంజనేయ స్వామి దేవాలయం, జూపాడుబంగ్లా మండలంలోని తర్తూరు దేవస్థానానికి సంబంధించి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అనంతరం ర్యాలీగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆలయ కమిటీ నాయకులు లింగారెడ్డి, మురళీధర్‌రెడ్డి, విశ్వహింద్ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు వెంకటేష్, భానుప్రకాష్‌రెడ్డి, కుమార్, బ్రహ్మయ్య ఆచారి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంట్రాక్టర్లు



మంత్రి బీసీకి వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

నంద్యాల హాస్పిటల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బిల్డింగ్స్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం రాష్ట్ర రహదారులు, భవనాలు, పెట్టుబడులు, మౌళిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో ఏపీ బిల్డింగ్ అసోసియేషన్ ఛైర్మన్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మంత్రి బీసీని కలిసి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలపై చర్చించారు. త్వరలోనే కాంట్రాక్టర్‌లకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ నాయకులు వల్లభనేని వెంకటేశ్, రఘురామిరెడ్డి, ఉప ఛైర్మన్ వెంకటనాగిరెడ్డి, తణుకు సతీష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం వరకే ధర్మవరం రైలు సర్వీసు

నంద్యాల నూనెపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం నుంచి అనంతపురం వరకే నడుపుతున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. ధర్మవరంలో 5వ నెంబర్ ప్లాట్ ఫారం నిర్మాణం, రైల్వే లైన్ పనులు జరుగుతుండటంతో అనంతపురం వరకే వెళతుందని అధికారులు తెలిపారు. 17215 మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 12వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నంద్యాల, బనగానపల్లె, కోవెలకుంట్ల, జమ్మలమడుగు, యర్రగుంట్ల నుంచి అనంతపురం వరకు వెళ్తుందని, 17216 ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 13వ తేదీ 31వ తేదీ వరకు అనంతపురం నుంచి బయల్దేరి మచిలీపట్నం వరకు వెళతుందని అధికారులు తెలిపారు. ప్రయాణికులు విషయాన్ని గమనించాలని కోరారు.

వైభవంగా హోమం

ఆత్మకూరు రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కురుకుంద గ్రామంలో వెలసిన కురుకులాంబదేవి ఆలయంలో కురుకులాంబదేవి జయంతి ఉత్సవాల్లో భాగంగా దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా శ్రీ లలితాసూక్త హోమం నిర్వహించారు. ఈనెల 8 నుండి 12వ తేది వరకు నిర్వహించే ఈ ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వేద పండితులు గూడా వెంకటాచలపతి శర్మ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీసూక్తఅభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ గావించి, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చలు, సహస్ర నామ స్తోత్ర పారాయణాలు చేపట్టారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా శ్రీ లలితాసూక్త హోమం నిర్వహించారు.

అమ్మవారికి కొబ్బరి కాయల సమర్పణ



కొబ్బరి కాయ తీసుకెళ్తున్న సిబ్బంది, భక్తులు

శ్రీశైలం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గానీ, శుక్రవారం గానీ భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 15న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభ హారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిన మండపములో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం కృష్ణా జిల్లా, గన్నవరంకు చెందిన పి. శివసూర్య కుమారి రూ. 1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

కమనీయం.. కల్యాణం

నంద్యాల కల్చరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరినాథ్ సెంటర్ దగ్గరలో మంగళవారం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అహోబిల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురష్కరించుకొని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం నిర్వహించారు. గిరినాథ్ సెంటర్‌లో మధుసూదనరెడ్డి, పద్మ దంపతుల ఆధ్వర్యంలో గత పది సంవత్సరాల నుంచి కల్యాణం నిర్వహిస్తున్నారు. అనంతరం స్వామికి పంచామృత అభిషేకాలు, తిరుమంజనసేవ, స్వామి వారి కల్యాణం నిర్వహించి, మహిళలకు పసుపు, గాజులు అంద జేశారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వ హించి అహోబిలంలో జరిగే బ్రహ్మోత్సవాలలోని భక్తులకు అన్నదానం చేసేందుకు మధుసూదన్‌రెడ్డి భక్తబృందం, మధుసూదన్ రాయల్, మౌళాలి, సుంకన్న, వెంకటయ్య, ఈఎస్ఐ సీతారాం, సుప్రియ, సులోచన, సంజీవ రాయుడు, వందలాదిమంది భక్తులు బయలు దేరారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు, అభిషేకం చేస్తున్న భక్తులు

రైతుల సమక్షంలో నిర్వహించాలి: ఆర్డీవో


బీరవోలులో రీసర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో విశ్వనాథం

రుద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండో విడత భూరీసర్వే రైతుల సమక్షంలోనే కొనసాగించాలని నంద్యాల ఆర్డీవో విశ్వనాథం అన్నారు. మంగళవారం మండలం లోని బీరవోలు గ్రామంలో భూరీ సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 29 గ్రామాల్లో రెండో విడత రీసర్వే కొనసాగుతుందన్నారు. రైతులు గైర్హాజరైతే ఆ నెంబరు తప్పించి రైతులు వచ్చిన తరువాతే సర్వే చేయాలన్నారు. రీసర్వేలు తప్పనిసరిగా రైతులు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మల్లికార్జునరావు, సర్వేయరు రమణ, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి

చాగలమర్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆళ్లగడ్డ వ్యవసాయశాఖ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని నేలంపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు చీడపీడలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో రంగనేతాజీ, వీహెచ్‌ఏ రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అహోబిల బ్రహ్మోత్సవాలకు గంగ నీరు

రుద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అడవిలోని తుండ్ల వాగు రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రధాన కాల్వ ద్వారా అహోబిల బ్రహ్మోత్సవాలకు నీటిని సరఫరా చేస్తున్నట్లు గంగ ఈఈ శివశంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెలుగుగంగ కాల్వ వెంట నీటి సామర్థ్యం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అహోబిళ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం పుణ్యా స్నానాలు ఆచరించేందుకు తెలుగుగంగ కాల్వ నుంచి నీరు అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు నీటిని అందిస్తున్నామని ఈఈ తెలిపారు. ఆయన వెంట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలన అందరి బాధ్యత


మాట్లాడుతున్న ఆళ్లగడ్డ ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్

చాగలమర్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలన అందరి బాధ్యతని ఆళ్లగడ్డ ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని ఒట్టి గుడిసె తండాలో నాటు సారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ నాటుసారా తయారు చేసి పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎక్సైజ్ ఎస్‌ఐ వరలక్ష్మి, మహిళా పోలీసు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు నిధులు మంజూరు : ఎంపీడీవో

అవుకు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోని లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేసినట్లు ఎంపీడీవో వెంగన్న మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో యూనిట్ ధర రూ. 1,80,000 ఉండగా, ఎస్సీ, బీసీలకు అదనంగా రూ. 50,000, ఎస్టీలకు రూ. 75,000, చెంచు లబ్దిదారులకు రూ, 1లక్ష అదనపు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మే చివరిలోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని తెలిపారు.

బందార్లపల్లెలో కొండముచ్చు హల్‌చల్

కొలిమిగుండ్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బందార్లపల్లె గ్రామంలో కొండ ముచ్చు హల్‌చల్ చేస్తోంది. మంగళవారం గ్రామంలో ఇరువురు వ్యక్తులపై దాడి చేయడంతో తీవ్ర గయాలయ్యాయి. ఎస్సీ కాలనీకా చెందిన ఓబులేషుపై దాడి చేయడంతో ముఖంపై 14కుట్లు పడినట్లు బాధితుడు వాపోయాడు. బీసీ కాలనీకి చెందిన నాగేంద్రకు నడుంపై తీవ్ర గాయాలయ్యాయి. వారం రోజులుగా కొండ ముచ్చు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని వాపోతున్నారు.

'అనుచిత వ్యాఖ్యలు తగదు'

బేతంచెర్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడిన మాటలు చాలా అభ్యంతకరంగా ఉన్నాయని ఎంహెచ్‌పీఎస్ డోన్ అధ్యక్షుడు ఇద్రుస్ బాషా అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాయచోటిలో జరిగిన ఘటన ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవే తప్ప రెండు మతాల మధ్య జరిగిన ఘర్షణగా భావించాడదని తెలిపారు. ఆదోని ఎమ్మెల్యే హుందాగా ప్రవర్తించాలని అన్నారు. ఎమ్మెల్యేపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వీధుల్లో చెత్త పడేస్తే చర్యలు

కొలిమిగుండ్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లలోని చెత్తను ఇష్టానుసారం వీధుల్లో పడేస్తే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి బాస్కరరెడ్డి హెచ్చరించారు. మంగళవారం నందిపాడు గ్రామంలో చెత్త సేకరణ కోసం చెత్త బుట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లోక్‌నాథరెడ్డి, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ

బనగానపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో రమణ మంగళవారం తెలిపారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రీయ, బ్రాహ్మణ, బలిజ కులాల మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులు తమ పేర్లను ఆయా సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలని కోరారు.

'జడ్పీటీసీ సభ్యుడి మృతి బాధాకరం'

ప్యాపిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలి జడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి మృతి బాధాకరమని జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ వేర్వేరుగా అన్నారు. మంగళవారం పట్టణంలో శ్రీరామిరెడ్డి మృతదేహాన్ని వారు సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

పిల్లర్లకే పరిమితం

● నిలిచిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు

● పట్టించుకోని అధికారులు


చాగలమర్రిలో పిల్లర్ల వద్దే ఆగిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు

చాగలమర్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు నేటికీ పిల్లర్లకే పరిమితమైంది. ఈ భవనానికి రూ.95 లక్షలు నిధులు టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరయ్యాయి. దీంతో పనులు ప్రారంభించి పిల్లర్ల వరకు వేసి నిలిపి వేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో భవన నిర్మాణ పనుల గురించి పట్టించుకోలేదు. దీంతో పిల్లర్లకే భవన నిర్మాణ పనులు పరిమితమయ్యాయి. పంచాయతీరాజ్ అధికారులు రెండు విడతలుగా భవన నిర్మాణ పనులకు ప్రతిపాదనలు పంపించిన ఫలితం లేదు. తహసీల్దార్ కార్యాలయ భవనం లేకపోవడంతో పాత ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, వీఆర్వోలు విధులు నిర్వహిస్తున్నారు. భవనం సరిగా లేకపోవడంతో ఇక్కట్లకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

రోజూ 25 ఎకరాలు రీ సర్వే చేయండి

● జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్


రికార్డులను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

సంజామల,మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు 25 ఎకరాలకు మించకుండా భూములు రీ సర్వే జరిగేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆదేశించారు. మంగళవారం మం డలం లోని హోత్రమదిన్నె గ్రామంలో జరిగే రీ సర్వే పనులను జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలో జరుగుతున్న రీ సర్వే పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. గ్రౌండు ట్రూతింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ విస్తీర్ణ కొలతలు అడిగి తెలుసుకుంటూ మార్పులు లేకుండా రికార్డులో ఉన్న మేరకే సర్వే పనులు చేపట్టాలన్నారు. గ్రామ సరిహద్దు స్థిరీకరణ , స్టోన్ ప్లాంటేషన్ తదితర పనులు కూడా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ పూర్తి అయినందున తదుపరి వ్యాలిడేషన్ ప్రక్రియ జరుగుతున్న తీరు పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్ కుమార్, డీటీ తులసి క్రిష్ణ, సర్వేయర్లు మల్లేశ్వరీ, క్రిష్ణయ్య, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌వోలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పుట్టాలమ్మ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 11(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ మండల పరిధిలోని ఆర్ కృష్ణాపురం గ్రామ సమీపంలో వెలసిన రామతీర్థ నృసింహ స్వామి, పుట్టాలమ్మ దేవత, పరశురామ లింగేశ్వరస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలకు అర్చకులు మంగళవారం అంకురార్పణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సాయి జయచంద్రారెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కలశస్థాపన, ఉత్సవ ధ్వజారోహణ, చక్రపెరుమాళ్ల ఉత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నృసింహస్వామికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించనున్నారు. అనంతరం చక్రపెరుమాళ్ల ఉత్సవం, రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరించనున్నారు.

నిందితుడి అరెస్ట్

ఉయ్యాలవాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కన్న తల్లిని హత్య చేసిన నిందితుడు అంబటి బాల గుర్రప్పను మాయలూరు గ్రామంలోని జమ్మలమడగు రస్తాలో మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకు న్నట్లు ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు. అనంతరం నిందితుడిని నంద్యాల కోర్టు న్యాయాధికారి ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

కోవెలకుంట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : అధిక రేట్లకు ఇసుక విక్రయిస్తున్న ఓ ట్రాక్టరు డ్రైవరును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. జమ్మలమడుగు పట్టణంకు చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి ట్రాక్టరులో ఇసుక తీసుకుని కోవెలకుంట్లకు వచ్చి అధిక రేట్లకు విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆంజనేయస్వామి దేవాలయానికి విరాళం

రుద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలోని పడమటి వీధిలో కొలువుదీరిన ప్రతాప రుద్ర ఆంజనేయస్వామి దేవాలయానికి స్థానిక రుద్రవరం గ్రామానికి చెందిన బండారు నాగేంద్ర రూ.50,116లు విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందించారు. దాత మాట్లాడుతూ దేవాలయానికి విరాళం అందించడం సంతృప్తిగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎం.గురుప్రసాద్, బొంత కాశయ్య, నరసింహ పాల్గొన్నారు.

సర్వేను వెంటనే పూర్తి చేయాలి

రుద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మిస్సింగ్ డేటా సర్వేను వెంటనే పూర్తి చేయాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసరు శివారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సిటిజన్ మిస్సింగ్ డేటా , ఎంప్లాయి మిస్సింగ్ డేటా, ఎంహెచ్‌ఎంఈ చిల్డ్రన్ ఆధార్ సర్వే వర్క్ ఫ్రం హోం, పీ-4 సర్వేలను వేగవంతం చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్లలో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర

బేతంచెర్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కోటపేటలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వైబీ వెం కటేశ్వర్లు సీనియర్ నాయకులు వై.ఎల్లయ్య, పార్టీ పట్టణ కమిటి సభ్యులు బి.రామాంజనేయులు, జే.శ్రీనివాసులు, యు.హరిప్రసాద్, ఎల్.రామాంజనేయులు, కే.రాజాబాబు, వెంకటరమణ, బక్కన్న, టింగ్ యువరాజు, రవి, చిన్న నరసింహులు పాల్గొన్నారు.

'ఫీజు పోరు'కు తరలిరండి

కొలిమిగుండ్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలంటూ బుధవారం వైసీపీ తలపెట్టిన 'ఫీజు పోరు' కార్యక్రమానికి యువకులు తరలిరావాలని వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు పేరం నందకిశోర్‌రెడ్డి మంగళవారం కోరారు. నంద్యాల జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి నిరుద్యోగులు, యువకులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

పంట నమోదు జాబితాను సరిచూసుకోండి

అవుకు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు పంట నమోదు జాబితాను సరిచూసుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ అన్నారు. మంగళవారం సుంకేసుల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పంట నమోదు జాబితాను విడుదల చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ పఠాన్‌నాయక్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి

డోన్ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ ఖాతాదారులు ప్రమాద బీమా పాలసీని సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ బ్యాంకు చీఫ్ మేనేజర్ హరికృష్ణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్టేట్ బ్యాంకు వద్ద వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

డోన్ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాలు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటసుబ్బారెడ్డి, సురేష్, ఖైమున్నీసా, ఉమాదేవి, సత్యనారాయణ తెలిపారు. పరీక్షలకు డిపార్ట్‌మెంట్ అధికారులుగా రాంప్రసాద్, శివుడు, మౌలాలి, విజయలక్ష్మి, రామ్మోహన్, రాఘవేంద్రమ్మ, సుబ్బారెడ్డి, సుబాన్ వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కస్టోడియన్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని యజమానులు

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని కోళ్ల దుకాణదారులు సరైన నిబంధనలు పాటించడం లేదు. బర్డ్‌ఫ్లూ కారణంగా మృతి చెందుతున్న కోళ్లను పూడ్చి పెట్టకుండా యథేచ్ఛగా రహదారుల పక్కనే పడేసి వెళ్తున్నారు. పట్టణానికి చెందిన ఓ కోళ్ల దుకాణ దారుడు లారీలో తరలిస్తున్న కోళ్లు మృతి చెందడంతో నల్లవాగుపల్లె సమీపంలో వాటిని రహదారి పక్కనే పడేసి వెళ్లారు. సదరు కోళ్ల దుకాణ యజమాని చనిపోయిన కోళ్లను, నాసిరకం కోళ్లను దుకాణదారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తెలుగుగంగతో రాయలసీమ సస్యశ్యామలం

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 11(ఆంధ్రజ్యోతి) : తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా రాయలసీమ ప్రాంతంలో ఫ్యాక్షన్ తొలగిపోయి వ్యవసాయంతో సస్యశ్యామలంగా ఉందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుగంగ కాల్వ చెన్నై వాసులకు తాగునీటిని అందిస్తుంటే కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తోందన్నారు. తెలుగుగంగ ప్రధాన కాల్వ 2004లో పూర్తవ్వగా డిస్ట్రిబ్యూషన్ ఛానళ్లు, పిల్ల కాల్వలు నేటికీ పూర్తి చేయలేదన్నారు. వీటికి టెండర్లు పిలిచి 20 సంవత్సరాలవుతున్నా పనులు పూర్తికాకపోవడంతో కళ్ల ఎదుట నీళ్లున్నా రైతులు సాగునీటిని వినియోగించుకోలేని దుస్థితి నెలకొందన్నారు. తెలుగుగంగకు కర్నూలు జిల్లాలో 1.28 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా ఆళ్లగడ్డ ప్రాంతంలోనే 80 వేల ఆయకట్టు ఉందన్నారు. జీప్ ట్రాక్ సరిగ్గా మెయింటైన్ చేయకపోవడం వల్ల తెలుగుగంగ ప్రధాన కాల్వ వెంట అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అహోబిలం ప్రాంతంలో 0.3 టీఎంసీల సామర్థ్యం కలిగి ఉన్న గండ్రేవురుల రిజర్వాయర్‌ను రూ.45 కోట్లతో 0.6 టీఎంసీల సామర్థ్యానికి పెంచేందుకు ప్రతిపాదనలు పూర్తయ్యాయని పనులు త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. తెలుగు గంగ ప్రాజెక్టుకు సంబంధించి నిర్వహణ, కాల్వల ఏర్పాటుపై ఓ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. కేసీ కెనాల్ ఛానల్‌ను ఆక్రమించి శిల్పా వెంచర్‌ను నిర్మించారని.. తద్వారా 700 ఎకరాలకు సాగునీరు అందడంలేదని దీనిపై సమగ్రంగా విచారించి చర్యలు తీసుకోవాలన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పశుసంపదను కాపాడుకోవాలి

● మారుతీ సాకారం, పశువైద్య సహాయ సంచాలకులు



బనగానపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు పశుసంపదను కాపాడుకోవాలని ఆర్థికాభివృద్ధి చెందాలని పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ మారుతీసాకారం అన్నారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: బనగానపల్లె పరిధిలో ఎన్ని పశువులు, గేదెలు, ఎద్దులు ఉన్నాయి ?

జవాబు: బనగానపల్లె పరిధిలో గేదెలు, నల్లపశువులు మొత్తం 4631, ఆవులు, ఎద్దులు 26,906 ఉండగా అవుకు మండల పరిధిలో గేదెలు, నల్లపశువులు 5171, ఆవులు, ఎద్దులు 14,334 ఉన్నాయి.

ప్రశ్న: పశువుల వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నారా?

జవాబు: పశువులకు, గేదెలకు, ఎద్దులు ఆవులకు గాలికుంటు వ్యాధికి టీకాలు వేస్తున్నాం. ఈనెల 31 వరకు టీకాలు వేస్తాం. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

ప్రశ్న: బనగానపల్లె, అవుకు మండలాల్లో మినీ గోకులాలు ఎన్ని మంజూరయ్యాయి. ఎన్ని పూర్తయ్యాయి. ?

జవాబు: బనగానపల్లె మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద 50 మినీ గోకులాలు మంజూరు కాగా ఇందులో 25 వరకు పూర్తయ్యాయి. అలాగే అవుకు మండలంలో 26 గోకులాలు మంజూరు కాగా ఇందులో 15 గోకులాలు పూర్తయ్యాయి.

ప్రశ్న: పాడి రైతులకు పశుగ్రాస క్షేత్రాలు మంజూరయ్యాయా?

జవాబు: పాడి రైతులు పశుగ్రాస క్షేత్రాలకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సాయం అంది స్తోంది. బోరు, నీటి వసతి ఉన్న సన్నకారు రైతులకు అర ఎకరా కు రూ. 33వేలు, రెండేళ్లకు రూ.66వేలు ప్రభుత్వం ఆర్థిక సా యం అందిస్తుందని, చిన్న, సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

ప్రశ్న: పశుబీమా పథకం అమలులో ఉందా?

జవాబు: పశుబీమా పథకం అందుబాటులో ఉంది. రైతులు ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పశువులు మృతి చెందితే రైతులు నష్టపోకుండా ఈపథకం ఆదుకుంటుంది. పశుబీమా పథకం కింద రూ.15వేల విలువగల పాడిగేదె లేదా పశువుకు రూ.200లు రైతులు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ ప్రీమియం మూడు సంవత్సరాలకు వర్తిస్తుంది. అలాగే పారం పాడిగేదె విలువ రూ.30వేలు విలువ ఉంటే రైతులు రూ.400లు బీమా ప్రీమియం చెల్లించాలి. ఈ ప్రీమియం మూడు సంవత్సరాలకు వర్తిస్తుంది. రైతులు పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలి.

చట్టాలపై అవగాహన ఉండాలి

చాగలమర్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని యువ న్యాయవాదులు సంజీవ, మహర్షి తెలిపారు. మంగళవారం వాసవీ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ షాబుద్దిన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సెక్షన్‌ల గురించి తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో కళాశాల కార్యదర్శి పుల్లారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి మహేశ్వరయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చాగలమర్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తెలిపారు. మంగళవారం చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో రెండవ సెట్ ప్రశ్నా పత్రాలను కస్టోడియన్‌ల ఆధ్వర్యంలో భద్రపరిచారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

శిశు సంరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంరక్షణ అందరి బాధ్యత అని వైద్యుడు ఇమ్రాన్ సూచించారు. మంగళవారం ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. క్రమం తప్ప కుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు.

50శాతం పూర్తి

ఉయ్యాలవాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో గాలికుంటు వ్యాధి టీకాలు యాభైశాతం పూర్తి చేసినట్లు మండల పశువైద్యాధికారి రవీంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం నర్సిపల్లె, గోవిందపల్లె, సర్వాయిపల్లె గ్రామాల్లో టీకాలు వేశారు. మార్చి చివరినాటికి వంద శాతం పూర్తి చేస్తామన్నారు.

నిధులు మంజూరు

ఉయ్యాలవాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు సబ్సిడీలో వ్యవసాయ పనిముట్ల అందిచేందుకు ప్రభుత్వం రూ. 10.42 లక్షల నిధులు మంజూరు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ బ్యాటరీ స్ప్రేయర్లు తొమ్మిది యూనిట్లు, పవర్ స్ప్రేయర్లు 22, ట్రాక్టర్ పనిముట్లు 28 యూనిట్లు మంజూరు అయినట్లు తెలిపారు. వీటిని ఆయా క్యాటగిరీల ప్రకారం రైతులకు సబ్సిడీలో అందిస్తామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జొన్నపంటకు మద్దతు ధర కల్పించాలి

బనగానపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జొన్న పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మైనార్టీ శాఖామంత్రి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిల ప్రియ, గిత్త జయసూర్య బృందం వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో ప్రత్యేకంగా సమావేశమై వినతిపత్రం సమర్పించారు. జొన్న రైతులను ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

మాన్యం భూములున్నా ఆలయాలపై నిర్లక్ష్యం


● బ్యాంకులో మూలుగుతున్న నిధులు


చిలకలూరులో శిథిలమైన ఈశ్వర చెన్నకేశవస్వామి ఆలయాలు


దెబ్బతిన్న ధ్వజస్తంభం

రుద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలూరు గ్రామంలో శివాలయం, చెన్నకేశవాలయం శిథిలమవుతున్నాయి. మాన్యం భూములు పదుల ఎకరాల్లో ఉన్నా దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏడాది దేవదాయ భూములకు కౌలు వేలం నిర్వహిస్తూ వచ్చిన లక్షలాది రూపాయలు బ్యాంకులో వేస్తున్నారు. కానీ ఆలయాలను మాత్రం పట్టించుకోవడంలేదు. ధ్వజస్తంభం దెబ్బతింది. కలశాలు కూడా లేవు. దేవదాయశాఖ అధికారులు శిథిలమైన దేవాలయాలను అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే


ఆర్. కొత్తూరు సమీపంలో రహదారి మలుపు వద్ద ప్రమాదకరంగా మారిన గుంత

రుద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం నుంచి ఎర్రగుడిదిన్నె రహదారి 11కిమీ పొడవునా ఉంది, ఈ రహదారిలో ప్రయాణం చేసే వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి కోతలకు గురై గుంతలు ఏర్పడ్డాయి. ఆర్.కొత్తూరు గ్రామ సమీపంలో కల్వర్టు కూలిపోయి చెట్లు మొలిచిన అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఈ రహదారి పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉంది. అధికారులు మాత్రం పట్టించుకోలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

మొక్క జొన్న కంకులకు భలే గిరాకీ ..

- ఒక్క రోజులో 2వేల కంకులు అమ్మిన రైతు


కాల్చిన మొక్క జొన్న పొత్తులు

కొలిమిగుండ్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఆహా ఏమి రుచి .. తినరా మైమరచి .. అంటూ సహజం గా వర్షాకాలంలో అత్యంత గిరాకీగా అమ్ముడయ్యే మొక్క జొన్న కంకులకు మంగళవారం కొలిమిగుండ్ల సంత మార్కెట్లో విపరీతమైన గిరాకీ లభించింది. తాడిపత్రి మండలం వెంకటరెడ్డిపల్లెకు చెందిన రైతు కొలిమిగుండ్ల సంత మార్కెట్లో ఒక్కో కంకి రూ.10చొప్పున విక్రయించాడు. ఒక్క రోజులోనే రికార్డు స్థాయిలో 2000 కంకులు విక్రయించి నట్లు తెలిపాడు. దీనిబట్టి మొక్కజొన్న పొత్తులకు వినియోగదారుల్లో ఉండే డిమాండ్ ఏపాటిదో తెలుస్తోంది. మొక్క జొన్న కంకులను కొందరు కాల్చుకొని తింటే, మరి కొందరు ఉడకబెట్టి, చిన్న పిల్లలు పాప్‌కార్న్‌లా తినడానికి ఇష్టపడతారు. ఆరోగ్య పరంగా ఎన్నో రకాల విటమిన్స్ అందించే మొక్క జొన్న పొత్తులు తినడానికి కాలంతో పనిలేదంటున్నారు వినియోగదారులు.